అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..





నేడు బిర్రు మహేందర్ మాదిగ
**ఆత్మీయ సన్మాన సభ**


WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -347 ఆదివారం26 ఏప్రిల్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ఎమ్మెల్సీలకు గవర్నర్ ఆమోదం

**అజహరుద్దీన్, కోదండరామ్‌కు ఊరట**

**త్వరలో విడుదల కానున్న గెజిట్**



**హైదరాబాద్ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. ఏడాది క్రితం పంపిన ఫైల్‌కు గవర్నర్ తాజాగా ఆమోద ముద్ర వేశారు. ఇందుకు సంబంధించి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతో తెలంగాణలో గవర్నర్ కోటాలోని నామినేటెడ్ ఎమ్మెల్సీల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. గత ప్రభుత్వం నుంచి సాగుతున్న ఉత్కంఠకు స్వస్తి పలుకుతూ, గవర్నర్ కోటాలో ఇద్దరు కీలక నేతలకు లైన్ క్లియర్ అయింది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ ను ప్రత్యేకంగా కలిసి, ఈ రెండు**మిగతాది 2లో...**




# అందరికోసం పనిచేస్తా..!



## కవిత కొత్త పార్టీ.. తెలంగాణ రాష్ట్ర సేన

**తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం**

**నా చెమటను చిందించి..పోరాటం చేశా**

**సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు**

**తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు**

**మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం**

**పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు**

**అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా**

**పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత**

**హైదరాబాద్ ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు.**మిగతాది 2లో...**

## అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఉండవు

**యుద్ధం ముగింపునకు డిమాండ్లు ఇవే**

**ఇరాన్ జాబితా అందజేత**

**పాక్ అధికారులతోఇరాన్ విదేశాంగమంత్రి అరాగ్చీ భేటీ**

**చర్చల కోసం పాక్‌కు వెళ్లొద్దు : అమెరికా ప్రతినిధులకు ట్రంప్ ఆదేశం**



**ఇస్లామాబాద్ :ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శనివారం పాకిస్తాన్ అధికారులతో ఇస్లామబాద్‌లో సమావేశమయ్యారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చల నిమిత్తం అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ ఇస్లామాబాద్ చేరుకుంటు న్నారు. చర్చలలో పురోగతి కన్పిస్తే అమెరికా ఉపా ధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఇస్లామాబాద్ వస్తారు. అయితే అమెరికాతో ప్రత్యక్ష చర్చల ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖై స్పష్టం చేశారు. యుద్ధం ముగించాలంటే ప్రతిపాదిత డిమాండ్లు పరిష్కరించాల్సిందేనని ఇరాన్ స్పష్టం చేసింది. వారిచ్చిన అభిప్రాయాలు, **మిగతాది 2లో...**

## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

**మే 9న తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ**

**పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మోదీ**

**పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభ**



**హైదరాబాద్ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ**మిగతాది 2లో...**

## 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన

**ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె అన్నీ లెక్కిస్తాం**

**: జనగణన తెలంగాణ డైరెక్టర్**

**తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామన్న తెలంగాణ డైరెక్టర్**

**ఒక భవనంలో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడి**

**హైదరాబాద్ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని**2లో...**



# ఆర్టీసీ విలీనానికి ఓకే

**రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపామని మంత్రి పొన్నం ప్రభాకర్‌వెల్లడి**

**కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు అంగీకరించినట్లు వెల్లడి**

**ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్న మంత్రి**

**హైదరాబాద్ ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు.వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు **మిగతాది 2లో...**






## 47 మంది మావోల లొంగుబాటు

**హైదరాబాద్‌లో 47 మంది మావోయిస్టుల సామూహిక లొంగుబాటు**

**డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగించిన మావోలు**

**లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే**

**ఆయుధాలు వీడి జనజీవనంలోకి రావాలని డీజీపీ పిలుపు**

**హైదరాబాద్ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా 47 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. ఈ సందర్భంగా వారు 34 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు.**మిగతాది 2లో...**

## ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

**2047 నాటికి ఈ రంగంలో ప్రపంచాన్ని శాసిస్తాం**

**: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**

**ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను శ్రీహరికోటకు జెండా ఊపి పంపిన సీఎం**







## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

**ఒకేసారి 30 మందికి ట్రాన్స్‌ఫర్**

**ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా జీ ముకుందరెడ్డి**

**నారాయణ్‌పేట్ కలెక్టర్‌గా సీహెచ్ ప్రియాంక**

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రియాంక అల**

**-పలు జిల్లాల కలెక్టర్ల మార్పు**

# అందరికోసం పనిచేస్తా..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు. తను తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి ఉద్యమకారులకు వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు. ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా అని ప్రకటించారు. తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా.



జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చిందని అన్నారు. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారని కూడా చిన్న హెచ్చరిక చేశారు. తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది.

మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత అన్నారు.

# అమెరికాతో ప్రత్యక్ష చర్చలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలను పాకిస్తాన్ ద్వారా అమెరికాకు చేరవేస్తామని ఆయన చెప్పారు. చర్చలపై ఇరాన్, అమెరికా పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తుండడంతో గందరగోళం నెలకొంది. అసలు శాంతి చర్చలు జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చర్చల విషయంలో ఇరాన్ వైపు నుంచి 'కొంత పురోగతి' కన్పిస్తోందని శ్వేతసౌధం చెబుతోంది. అమెరికా డిమాండ్లను నెరవేర్చే విషయంలో ఇరాన్ తమకు ఓ ఆఫర్ ఇస్తుందని చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ వివరాలు మాత్రం తెలియవని అంటున్నారు. ఇరాన్ ఆఫర్‌ను పరిశీలి స్తామని ఆయన చెప్పారు. యురేనియం శుద్ధి కార్యక్ర మానికి ఇరాన్ స్వస్తి చెప్పాల్సి ఉంటుందని, హోర్ముజ్ జలసంధిలో నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేం దుకు వీలు కల్పించాలని, అప్పుడే ఒప్పందం సాధ్యప డుతుందని స్పష్టం చేశారు. కాగా అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపే అంశం తమ ఎజెండాలోనే లేదని ఇరాన్ మీడియా కుండబద్దలు కొట్టింది. పాకిస్తాన్ పర్యటనలో అరాగ్చీ 'అణు చర్చలు' జరపబోరని, కేవలం ద్వైపాక్షిక అంశాలనే ప్రస్తావిస్తారని ఇరాన్ జాతీయ భద్రతా కమిటీ అధిపతి ఇబ్రహీం అజిజి తెలిపారు. అరాగ్చీ తన పర్యటనలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సైనిక దళాల ప్రధానాధికారి అశిం మునీర్‌తో కూడా సమావేశమయ్యే అవకాశం ఉంది. ఇదిలావుండగా అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ ఇరాన్, అమెరికా మధ్య రెండో విడత చర్చల కోసం పాకిస్తాన్ తన ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఇరు పక్షాలను చర్చల వేదిక వద్దకు తీసుకొచ్చేందుకు తెర వెనుక ప్రయత్నాలు చేస్తోంది.

చైనా చమురు రిఫైనరీపై ట్రంప్ ఆంక్షలు

చైనాకు చెందిన ఓ ప్రధాన చమురు శుద్ధి కర్మాగారంపై ట్రంప్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఇరాన్ చమురును రవాణా చేస్తున్నాయన్న కారణం తో నలభై షిప్పింగ్ కంపెనీలు, నౌకలపై కూడా ఆంక్ష లు విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే కంపెనీలు, దేశాలపై సెకండరీ ఆంక్షలు విధిస్తానంటూ ట్రంప్ ప్రభుత్వం ఇదివరకే హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌కు కీలక ఆదాయ వనరుగా ఉన్న చమురు ఎగుమతులను అడ్డుకోవాలన్న అమెరికా ప్రభుత్వ ప్రణాళికలో ఈ ఆంక్షలు భాగమేనని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. అంతర్జాతీయ ఇంధన సరఫరాలకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధిని అమెరికా ఇప్ప టికే దిగ్బంధించిన విషయం తెలిసిందే. అమెరికా, చైనా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్ మధ్య కొద్ది వారాలలో బీజింగ్‌లో చర్చలు జరగనున్న తరుణంలో ఈ ఆంక్షలు అమలులోకి రావడం గమనార్హం.

తాజాగా అమెరికా ఆంక్షలకు గురైన వాటిలోఢ ఓడరేవు నగరమైన డాలియన్‌లోని హెంగ్లీ పెట్రో కెమికల్ కేంద్రం ఉంది. ఇది రోజుకు సుమారు నాలు గు లక్షల బ్యారల్స్ ముడి చమురును ప్రాసెస్ చేస్తుం ది. చైనాలోని అతి పెద్ద స్వతంత్ర రిఫైనరీలలో ఇది ఒకటి. హెంగ్లీకి 2023 నుంచి ఇరాన్ ముడి చమురు నౌకలు వస్తున్నాయని అమెరికా ఆర్థికశాఖ తెలిపింది. ఇది ఇరాన్ సైన్యానికి వందల మిలియన్ల ఆదాయాన్ని సమకూర్చిందని ఆరోపించింది. ఓ ఇరాన్ వ్యతిరేక గ్రూప్ ప్రకారం టెహ్రాన్ చమురును కొనుగోలు చేస్తు న్న అనేక చైనా కేంద్రాలలో హెంగ్లీ ఒకటి. ఇరాన్ తన చమురును అంతర్జాతీయ మార్కె ట్లకు తరలించేం దుకు నౌకలు, మధ్యవర్తులు, కొనుగోలుదారులపై ఆధారపడుతోందని, వారందరి నెట్‌వర్క్ పైన ఉచ్చు బిగిస్తామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు.

ఇరాన్‌తో వ్యాపారంచేస్తే సెకండరీ ఆంక్షలు విధి స్తామంటూ అమెరికా ఆర్థికశాఖ ఈ నెల ప్రారంభం లో చైనా, హాంగ్‌కాంగ్, యూఏఈ, ఒమన్ దేశాల లోని ఆర్థిక సంస్థలకు లేఖలు రాసింది. ఆయా దేశా లు ఇరాన్ చట్టవిరుద్ధ కార్యకలాపాలను అనుమతిస్తు న్నాయని ఆరోపించింది. ఇరాన్ చమురును కొను గోలు చేస్తేఢఇరాన్ సొమ్ము మీ బ్యాంకులకు చేరితే సెకండరీ ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నా మని బెస్సెంట్ ఈ నెల 15న విలేకరుల సమావేశం లో ఆయా దేశాలకు సంకేతాలు పంపారు. పర్షియన్ గల్ఫ్‌లో చమురు, సహజవాయువు నౌకల రవాణాకు అంతరాయం ఏర్పడుతుండడంతో అంత ర్జాతీయ ఇంధన వాణిజ్యం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొం టోంది. ఈ పరిస్థితులలో అమెరికా విధిం చిన ఆంక్షల కారణంగా చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

## 2047 నాటికి ఈ రంగంలో ప్రపంచాన్ని శాసిస్తాం : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

## ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను శ్రీహరికోటకు జెండా ఊపి పంపిన సీఎం

**హైదరాబాద్‌ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**

దేశంలో ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ అవతరించనుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ తయారు చేసిన భారతదేశపు తొలి ప్రయివేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను శనివారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరో స్పేస్ పార్క్‌లోని మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. ప్రీ ఫ్లైట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకుని తదుపరి ప్రయోగం కోసం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఏరోస్పేస్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకు వెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రయివేట్ ఆర్బిటల్ రాకెట్‌ను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం ఏరోస్పేస్ రంగంలో రాష్ట్రాభివృద్ధికి ఇదొక మైలురాయని అభివర్ణించారు. స్కైరూట్ సంస్థ 2022లో తన తొలి రాకెట్‌ను ప్రయోగించిందనీ, అయితే ఇంత తక్కువ సమయంలోనే ఆర్బిటల్ ప్రయోగ దశకు చేరుకోవడం హర్షణీయమని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బోయింగ్, ఎయిర్‌బస్, సాఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజాలు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్నాయని గుర్తు చేశారు. 2047 నాటికి ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రపంచాన్ని శాసించే దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం,



2023-24, 2024-25 మధ్యలో దేశంలోనే ఇంజినీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం అత్యధిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. ప్రపంచ విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక దిగ్గజాలతో భాగస్వామ్యాల ద్వారా ఏరోస్పేస్ రంగం అవసరాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలపై తమ ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. అందుకు అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభతో స్కైరూట్ వంటి కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకనుగుణంగా ప్రతిభావంతులకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) త్వరలో ఉన్నతీకరించబడనున్న పాలిటెక్నిక్ కళాశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఆయన వివరించారు. స్కైరూట్ సంస్థ తమకు అవసరయ్యే నిపుణుల కోసం హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో ఉన్న ఏటీసీని సందర్శించాల్సిందిగా సీఎం ఈ సందర్భంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్‌రెడ్డి, స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు నాగ భరత్ డాకా తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి.

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.

# 2027 ఫిబ్రవరి నుంచి రెండో దశ జనగణన

(మొదటి పేజీ తరువాయి)

పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

# 47 మంది మావోల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని అధికారులు తెలిపారు.

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడం, సాయుధ పోరాటంపై విరక్తి చెందడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సామూహిక లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ఇది గట్టి దెబ్బగా పరిగణిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంత పెద్ద సంఖ్యలో మావోలు లొంగిపోయిన చివరి బ్యాచ్ బహుశా ఇదేనని, ఇకపై ఈ స్థాయిలో లొంగిపోవడానికి మావోయిస్టులు కూడా ఎక్కువ మంది లేరని అన్నారు. "హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదు. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనంలోకి రావాలి" అని ఇంకా అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది మావోయిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే హెల్త్ కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.

# ఆర్టీసీ విలీనానికి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.

# ఎమ్మెల్సీలకు గవర్నర్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీలను తప్పనిసరిగా ఆమోదించాలని కోరారు. దీంతో గవర్నర్ ఆ ఫైల్ ను తెప్పించుకొని, పరిశీలించారు. అనంతరం అప్రూవల్ ఇవ్వడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోదండరామ్, సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ అమీర్ అలీఖాన్ కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. కానీ బీఆర్ఎస్ ఈ పేర్లపై కోర్టును ఆశ్రయించింది. దీంతో గవర్నర్ కూడా పెండింగ్ లో పెట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కౌశిక్‌రెడ్డి, శ్రవణ్ దాసోజు పేర్లను ఇదే కోటాలో ప్రతిపాదించగా, అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారిని తిరస్కరించారు. వారు రాజకీయ నేపథ్యం ఉన్నవారని, సేవా,సాంస్కృతిక రంగాలకు చెందిన వారు కాదని గవర్నర్ గతంలో అభ్యంతరం తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌లను ప్రతిపాదించగా, బీఆర్ఎస్ నేతలు దీనిపై కోర్టుకు వెళ్లారు. వారిని ఎమ్మెల్సీగా నియమిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత 2025 ఆగస్ట్ 30న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే ప్రక్రియను చేపట్టింది. దీనిలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరామ్, మహమ్మద్ అజహరుద్దీన్ పేర్లను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేసింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వీరి నియామక ఫైళ్లపై సంతకం చేశారు.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

## ఒకేసారి 30 మందికి ట్రాన్స్‌ఫర్

## ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా జీ ముకుందరెడ్డి

## నారాయణ్‌పేట్ కలెక్టర్‌గా సీహెచ్ ప్రియాంక

## హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రియాంక అల -పలు జిల్లాల కలెక్టర్ల మార్పు

**హైదరాబాద్‌ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**

రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. జిల్లా కలెక్టర్లు సహా పలు విభాగాల్లోని 30 మంది ఐఏఎస్‌లను ఒకేసారి ట్రాన్స్‌ఫర్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్ (1995)ను ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆయన స్థానాన్ని ఎమ్ దానకిషోర్ (1996)తో భర్తీ చేశారు. ఆయన ప్రస్తుతం తాను నిర్వహిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నర్ అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా బీ విజియేంద్రను నియమించారు. ఈ పోస్టులో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సబ్యసాచిఘోష్‌ను రిలీవ్ చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి (2010)ని లేబర్, ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా నియమించారు. ఆమె రెవెన్యూ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ పోస్టుల్లో ఇప్పటివరకు కొనసాగిన దానకిషోర్ (1996)ను రిలీవ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శిగా పనిచేస్తున్న కృష్ణ ఆదిత్య (2014)ను పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించారు. పౌరసరఫరాల శాఖ సీఈఓగా పనిచేస్తున్న జండగీ హన్మంతు కొండిబాను ఆరోగ్య శ్రీ సీఈఓగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న పీ ఉదయ్‌కుమార్ (2016)ను జీహెచ్ఎంసీ గోల్కొండ జోనల్ కమిషనర్‌గా నియమించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రియాంక (2016)ను రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించారు. గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బీఎమ్ సంతోష్ (2017)ను నియమించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (2018)ని ఐటీశాఖ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఆయనకే గనుల శాఖ వీసీఎమ్‌డీగాకూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంటర్‌బోర్డు డైరెక్టర్‌గా అభిలాష అభినవ్ (2018) నియమితులయ్యారు.


# అన్నదాతకు అందని మార్క్‌ఫెడ్ అండ


- అక్రమార్కులకు మద్దతు ...
రైతులకు కన్నీళ్లు
- ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు..
దళారులకు వర ప్రసాదం
- ఖజానాకు గండి..
దగా పడుతున్న కర్షకులు










**హనుమకొండ/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** రైతు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన మార్క్‌ఫెడ్ (రాష్ట్ర మార్కెటింగ్ సమాఖ్య) లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య వారధిగా ఉండి, పండించిన పంటకు మద్దతు ధర కల్పించాల్సిన ఈ సంస్థ, క్షేత్రస్థాయిలో అధికారుల ఉదాసీనత వల్ల అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా యాసంగి మక్కజొన్న సాగులో రైతులు అష్టకష్టాలు పడుతుంటే, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వారధిగా ఉండాల్సిన సంస్థ..

మార్క్‌ఫెడ్ ప్రభుత్వ అనుబంధ సంస్థగా పనిచేస్తుంది. దీని పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీలు) ఉంటాయి. పంట చేతికి వచ్చినప్పుడు మార్కెట్‌లో ధర తగ్గితే, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ పంటను సేకరించాలి. ఇలా సేకరించిన లక్షల టన్నుల ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ చేసి, ఆ తర్వాత టెండర్ల ద్వారా వేలం వేస్తారు. ఈ ప్రక్రియలో వచ్చే నష్టాన్ని ప్రభుత్వం భరిస్తూ మార్క్‌ఫెడ్ సంస్థకు నిధులు మంజూరు చేస్తుంది. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలోనూ ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది.

### తీరని జాప్యం.. దళారుల రాజ్యం!

ప్రతి ఏటా మక్కజొన్న సీజన్ ముగిసిపోతున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. పంట కోతలు పూర్తయి, కళ్లాల్లో ధాన్యం నిల్వ ఉన్నప్పుడు కేంద్రాలు తెరవకపోవడంతో, సామాన్య రైతు గత్యంతరం లేక తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. రైతుల నుంచి సరుకు చేజారాక. అప్పుడు అధికారులు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు.

### అధికారులు - వ్యాపారుల కుమ్మక్కు

కేంద్రాలు ప్రారంభమయ్యాక ప్రైవేట్ వ్యాపారస్తులు రంగంలోకి దిగుతున్నారు. రైతుల దగ్గర తక్కువ ధరకు కొన్న మక్కలను, వారి వద్దే సేకరించిన పట్టాదారు పాస్‌బుక్కుల ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకుంటున్నారు. వ్యాపారస్తులు తమ సొంత వాహనాలతో సరుకు తరలిస్తూ వేగంగా కాంటాలు వేయించుకుంటున్నారు.

నిజమైన రైతులకు అందాల్సిన మద్దతు ధర, బోనస్ అంతా వ్యాపారుల జేబుల్లోకి చేరుతోంది.

రైతుల పేరుతో జరుగుతున్న ఈ అక్రమ లావాదేవీల వల్ల ప్రభుత్వం ఇచ్చే కోట్ల రూపాయల సబ్సిడీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి.

### సందేహాల వెల్లువ..

ఏటా ఎన్ని లక్షల టన్నులు కొంటున్నారు? అందులో ఎంత నష్టం వస్తోంది? ప్రభుత్వం నుంచి వచ్చే కోట్లాది రూపాయల నిధులు నిజంగా రైతులకే అందుతున్నాయా? అనే ప్రశ్నలు మేధావుల నుంచి వస్తున్నాయి. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లు, రైతుల పేరు చెప్పి అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారని రైతు సంఘాలు మండిపడుతున్నాయి.

### ప్రభుత్వానికి రైతుల విన్నపం...

మక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై ఉన్నతాధికారులు నిఘా పెట్టాలి. కేంద్రాలు సకాలంలో తెరిచేలా చూడటంతో పాటు, గిట్టుబాటు ధర నేరుగా రైతు ఖాతాలోకే జమయ్యేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకున్నప్పుడే వ్యవస్థ మారుతుందని అన్నదాతలు కోరుతున్నారు


# నేడు బిర్రు మహేందర్ మాదిగ ఆత్మీయ సన్మాన సభ

## తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నేత ప్రభాకర్ పిలుపు




**వర్ధన్నపేట/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** దళిత రత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ ఆత్మీయ సన్మాన సభను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రభాకర్ మాదిగ ఒక ప్రకటనలో కోరారు. సమాజ సేవలో మహేందర్ మాదిగ అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నల్లబెల్లి గ్రామంలో నిర్వహించే సన్మాన కార్యక్రమానికి జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని ఉద్యమకారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, కవులు, కళాకారులు, మహిళలు, రైతులు. నిరుద్యోగ యువత, దళిత సంఘాల ప్రతినిధులు హాజరై ఈ ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.










# డిప్యూటీ సీఎంని కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే..



**బయ్యారం/,ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)** ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధి కోసం శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ను ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రహదారులు,మౌలిక వసతులు,అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల విడుదల,నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై డిప్యూటీ సీఎంకి వివరించారు.ముఖ్యంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరితగతిన నిధులు మంజూరు చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సమస్యలను శ్రద్ధగా విని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

# 15 ఏళ్ల లోపు వయస్సు బాలికలు హెచ్ పివి వ్యాక్సిన్ తీసుకోవాలి.

**-డాక్టర్ విజయ్ కుమార్..**




**బయ్యారం/,ఏప్రిల్ 25, (జర్నలిస్ట్ వార్త)** 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలని బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. మండలం కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో 15 ఏళ్ల వయస్సు గల బాలికలకు (హెచ్ పి వి) వ్యాక్సిన్ ఇవ్వడం మొదలుపెట్టినట్లు తెలిపారు..ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను నివారించడానికి 14 ఏళ్ల వయసుగల బాలికలకు హెచ్ పివి వ్యాక్సిన్ ను ప్రభుత్వం ఉచితంగా అందించి క్యాన్సర్ కు కారణం అయ్యే హెచ్‌పివి వైరస్ నుండి బాలికలకు ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుందన్నారు.ఈ వ్యాధిని నివారించడానికి హెచ్ పివి వ్యాక్సిన్ తీసుకోవడం చాలా ముఖ్యం.ఈ వ్యాక్సిన్ ను 15 ఏళ్ల ఆడపిల్లలందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది,ఆశ వర్కర్స్,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే.



**బయ్యారం/,ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)** రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఇల్లందు ఆర్ అండ్ బి రోడ్డు నుండి వెంకన్నగూడెం వరకు బీటీ రోడ్డు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఈ రహదారి ఎంతో కీలకమని,ఈ రోడ్డు మంజూరు అయితే ఆ ప్రాంత అభివృద్ధికి ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మంత్రి సీతక్క వినతిని సానుకూలంగా పరిశీలించి అతి త్వరలోనే రోడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,మాజీ సొసైటీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

**ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి 27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు**

**ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు**

**హైదరాబాద్,ఏప్రిల్25(ఆర్ఎన్ఎ):** బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

# మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి: జాప్యం వద్దు

## జాయింట్ కలెక్టర్ ఎన్. రవి ఆదేశం





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని స్థానిక సహకార సంఘంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. రవి మక్క రైతులతో మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటివరకు సుమారు 5,444 క్వింటాళ్ల మక్కలను తరలించామని, ఇంకా మూడు లారీల మక్కలు లోడింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. లోడింగ్‌లో జాప్యం ఎందుకు జరుగుతోందని సొసైటీ సీఈఓ తిరుపతిని ప్రశ్నించారు. వెంటనే లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు.
రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరాకు 25 క్వింటాళ్లకే పరిమితి విధించిందని, కానీ తాము 3035 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించామని, మిగతా మక్కల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనికి స్పందించిన జేసీడ వచ్చే నెలలో ఎకరాకు కొనుగోలు పరిమితిని పెంచే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మక్కలతో పాటు వడ్ల కొనుగోళ్లు కూడా త్వరితగతిన పూర్తిచేయాలని, అవసరమైన కాంటాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీడీవో ఎన్. విజయ్‌కుమార్, సొసైటీ బ్యాంక్ సీఈఓ తిరుపతి, అకౌంటెంట్ సురేష్, ఆర్ఐ సదానందం, రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

## వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



**నర్సంపేట/, ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
ఉపాధి హామీ పనులు చేసి నెలలు గడిచినా కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట ఎంపీడీవో కార్యాలయంలో డిమాండ్లతో కూడిన మెమొరాండం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఉపాధి హామీ పథకం బలహీనపడుతోందన్నారు. నాలుగు నెలలు గడిచినా కూలీలకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, మంచినీళ్లు, టెంట్లు, పనిముట్లు అందకపోవడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోజంతా శ్రమించినా గిట్టుబాటు అయ్యే వేతనం లభించడం లేదని, అనవసర ఆంక్షలతో కూలీలను వేధిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ చట్టం కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను దెబ్బతీసే చర్యలు ఆపాలని కోరారు. పనిదినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణ పేదలకు కూడా పథకాన్ని విస్తరించాలని సూచించారు.
గ్రామీణ ప్రాంతాల్లో పనుల కొరతతో పేదలు పట్టణాలకు వలస వెళ్తున్నారని, ఉపాధి హామీ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం చురుకుగా వ్యవహరించి కార్మికులందరికీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బస్కే మొగిలి, గట్ల నర్సింగరావు, కాటిపాకల చేరాలు, శనిగరపు బంటి, బస్కే రవి, జన్ను సారంగం, జన్ను అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే, పోషణ పక్వాడా ముగింపు

## ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామనాథ్





**నర్సంపేట/, ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణ పరిధిలోని నర్సంపేట4 అంగన్వాడీ కేంద్రంలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే, పోషణ పక్వాడా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. సీడీపీవో మధురిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పోషకాహార పథకాలను అమలు చేస్తోందన్నారు. ఒక పూట భోజనం, పాలు, గుడ్లు అందిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సంపేట4 అంగన్వాడీ కేంద్రం ఆదర్శంగా పనిచేస్తోందని అభినందించారు. సీడీపీవో మధురిమ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆటపాటలతో పాటు ప్రాథమిక విద్య అందిస్తూ పాఠశాల ప్రవేశానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ఐదేళ్లు పూర్తి చేసిన పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నామని, అందులో భాగంగానే గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు.
స్థానిక కౌన్సిలర్ రోజారాణి మాట్లాడుతూ కేంద్రంలో లబ్ధిదారులు అధికంగా ఉన్నప్పటికీ భవనం చిన్నదిగా ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త భవన నిర్మాణం కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. సమాజానికి ఉపయోగపడే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఈ సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.
అంగన్వాడీ టీచర్ నల్ల భారతి మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు టిహెచ్ఆర్ పంపిణీ జరుగుతుందని తెలిపారు.
అనంతరం చైర్‌పర్సన్, అధికారులు, కౌన్సిలర్ల చేతుల మీదుగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# కట్రియాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

## విద్యే సామాజిక మార్పుకు అసలైన ఆయుధం : కొండేటి భాస్కర్










**వర్ధన్నపేట/ ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
సమాజంలోని రుగ్మతలను తొలగించి, ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్య ఒక్కటే శక్తివంతమైన మార్గమని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు కొండేటి భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను కేవలం ఆటపాటలకే పరిమితం చేయకుండా, విద్యార్థులు తమలోని దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీయాలని భాస్కర్ కోరారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి శిబిరాలు వరం వంటివని, వీటి ద్వారా పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే శక్తి లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ వంటి మహనీయులు చూపిన బాటలో పయనించడమే మన లక్ష్యం కావాలి. విద్య అనేది కేవలం మార్కుల కోసం మాత్రమే కాదు, అది వ్యక్తిత్వ వికాసానికి పునాది కావాలని సామాజిక చైతన్యానికి విద్య ఒక వజ్రాయుధంలా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరం ద్వారా విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండావ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలుక్రీడలు, శారీరక దృఢత్వంవంటి అంశాలపై నిపుణులచే అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ముత్యాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి ముత్యాల బాబు, కార్యదర్శి తాటికాయల రాజు, గౌరవ సలహాదారులు ముత్యాల దీపక్, ఇరుకు రాజు స్థానిక వార్డు సభ్యులు ఎలుకట్టే రాజు, సంఘం సభ్యులు ముత్యాల అఖిల్, ముత్యాల భరత్, గజవెల్లి బన్నీ , విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

## హాజరైన నిమ్మల మనోహర్




**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు హైదరాబాదులోని నాగోలు (బండ్లగూడ)లో ఐదు రోజులపాటు ఉపాధ్యాయ శిక్షణ తరగతులు నిర్వహించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ తెలిపారు. క్రింది స్థాయి కార్యకర్తలకు వివిధ అంశాలపై రాజకీయ అవగాహన పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ శిక్షణకు హాజరైన నిమ్మల మనోహర్‌ను జిల్లాలోని ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, అంబేద్కర్ వాదులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడ తనను రాష్ట్ర ఉపాధ్యాయ శిక్షణకు పంపించి ప్రోత్సహించిన సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతికి, జిల్లా పార్టీ యంత్రాంగానికి విప్లవ అభినందనలు తెలిపారు.

# మండుటెండల్లో అడ్మిషన్ల ప్రచారం ఆపండి


## ఎంఈఓ రాజేశ్వరరావు హెచ్చరిక




**సత్తుపల్లి/, ఏప్రిల్ 25 (జర్నలిస్ట్ వార్త):**
మండుటెండల్లో అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులను వీధుల వెంట తిప్పడాన్ని వెంటనే నిలిపివేయాలని ఎంఈఓ రాజేశ్వరరావు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలను హెచ్చరించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు.
ఇటీవల కొన్ని విద్యాసంస్థలు ఉపాధ్యాయులను అడ్మిషన్ల ప్రచారానికి పంపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి. మండుటెండల్లో ప్రచారం చేయడం వల్ల ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురవుతున్నారని ప్రైవేట్ టీచర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి మండల ప్రైవేట్ ఉపాధ్యాయులు ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. మే నెలాఖరు వరకు అడ్మిషన్ల ప్రచారాన్ని నిలిపివేయాలని వారు కోరారు. పరిస్థితిని గమనించిన ఎంఈఓ రాజేశ్వరరావు యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయులను ఎండల్లో తిప్పితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడ్మిషన్ల పేరుతో ఇతర పాఠశాలలపై అసత్య ప్రచారం చేయవద్దని సూచించారు. సత్తుపల్లి పట్టణంలో సీబీఎస్ఈ గుర్తింపు పొందిన పాఠశాలలు లేవని స్పష్టం చేశారు

# మీకు మీరే ఎన్యూమరేటర్లు.

## -తహశీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,ఏప్రిల్ 25.(జర్నలిస్ట్ వార్త)**
జన గణన -2027 కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో మీ వివరాలను మీరే ఎన్యూమరేటర్ పోర్టల్లో పొందుపర్చుకునే అవకాశం ఉందని మండల తహసీల్దార్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 10వ తేదీ ఎన్యూమరేషన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇంటి సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవడానికి సులభమైన, వేగవంతమైన విధానమన్నారు. మొబైల్ ఫోన్,కంప్యూటర్,ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా నమోదు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు. వివరాలు నమోదు తరువాత యూనిక్ కోడ్ పొందాలని, అనంతరం ఇంటికి వచ్చే గణనాధికారికి చూపించాలన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు,ప్రభుత్వ ఉద్యోగులు,యువత,మహిళా సంఘాలు,స్వయం సహాయక సంఘాలు,బ్యాంకు ఉద్యోగులు,ఇతర రంగాల వారు స్వీయ లెక్కింపులో పాల్గొనాలని పిలుపునిచ్చారు

# కొత్తపల్లిలో భూమి వివాదం.. ఇద్దరిపై కేసు నమోదు



**భీమదేవరపల్లి/ఏప్రిల్25 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన లంకదాసరి పూర్ణచందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ కొత్తపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 226/1లో ఉన్న 1 ఎకరం 13 గుంటల భూమిలోకి అదే గ్రామానికి చెందిన వేల్పుల యేసేబు, ఆయన భార్య వేల్పుల పాపమ్మ ప్రవేశించి సుమారు లక్ష రూపాయల విలువైన మట్టిని తీయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పూర్ణచందర్ అక్కడికి చేరుకుని తన భూమిలోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించగా, ఆ భూమి తమదేనని వాదిస్తూ దుర్భాషలాడి, బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, యేసేబు, పాపమ్మలపై కేసు నమోదు చేశారు. భూమి వివాదాన్ని దృష్టిలో ఉంచుకుని పాపమ్మను భీమదేవరపల్లి తహసిల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ముల్కనూరు సబ్ ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

# ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

**తురకల సోమారంలో కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ శ్రీనివాస్**



**పర్వతగిరి/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు చేయాలని తురకల సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ సూచించారు. శనివారం గ్రామంలో వెన్నెల గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం రాజీర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా వేగవంతంగా కాంటాలు నిర్వహించాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలగకుండా గ్రామ పంచాయతీ తరపున కేంద్రంలో లైటింగ్ ఏర్పాట్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. హమాలీలు, రైతులు, నిర్వాహకులు సమన్వయంతో వ్యవహరించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రాజీర్, కిరణ్, ఆర్ఎం సైదిరెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్ కొమురయ్య, మాజీ సర్పంచ్ వెంకన్న, వివో అధ్యక్షురాలు రజిత, సెంటర్ ఇంచార్జ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడికి ఉపాధ్యాయిని ఆసరా

**మాజీ హెడ్మాస్టర్ పద్మజ మానవత్వం**



**సంగెం/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** విధి నిర్వహణలో ఉన్నప్పుడు చూపిన ఆత్మీయతను, బదిలీపై వెళ్లినా ఆమె మర్చిపోలేదు. ఆపదలో ఉన్న పాత విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించి తన ఉదారతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే సంగెం మండలం మొండ్రాయి గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వర్తించిన టి. పద్మజ, తన పాత పరిచయస్తుడైన ముమ్మిడివరం నివాసి అవనిగంటి సారంగం ఆటో ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్నారు. ప్రస్తుతం హనుమకొండలో నివసిస్తున్న ఆమె, సమాచారం అందిన వెంటనే మచ్చపురం చేరుకొని బాధితుడిని పరామర్శించారు. ప్రమాదం నుంచి కోలుకుంటున్న సారంగంతో మాట్లాడి, త్వరలోనే సాధారణ స్థితికి చేరుకుంటారని మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ. 2,500 నగదుతో పాటు, కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. బదిలీ అయి వెళ్లినా తమ కష్టాన్ని గుర్తుంచుకొని వచ్చి సహాయం చేసిన మేడం కి సారంగం, ఆయన కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మేడం సేవా గుణాన్ని అభినందించారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**తెలిపిన వివరాలు గీసుగొండ పోలీసులు**



**గీసుగొండ/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని కోనయమాకుల గ్రామ శివారులో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. శనివారం గ్రామ శివారులోని శిరీష బాబురావుకు చెందిన మక్కజొన్న చేనులో ఉన్న వేప చెట్టు కింద సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి శవమై పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుమారు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, చామనచాయ వర్ణం కలిగి ఉన్నాడు. ఎరుపు రంగు ఫుల్ షర్ట్, తెలుపు బనియన్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. జీన్స్ ప్యాంట్‌కు ఎరుపు రంగు బిళ్ళలు, గోధుమ రంగు బెల్ట్ ఉన్నాయి. మెడలో, కుడి చేతికి, నడుముకు ఎరుపు రంగు దారాలు కట్టి ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు వెంటనే గీసుగొండ పోలీసులను సంప్రదించాలని కోరారు.సంప్రదించాల్సిన నంబర్లు:సీఐ: 8712685240ఎస్సై: 8712685250పోలీస్ స్టేషన్: 8712685031

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**కలెక్టర్ ను కలిసిన మున్సిపల్ కమిషనర్ జోనా**





**వర్ధన్నపేట/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా శనివారం జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి వివరించారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వారికి నివేదించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ భేటీలో మున్సిపల్ విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధిపై చైర్మన్ సారంగపాణి తో కమిషనర్ జోనా భేటీ





**వర్ధన్నపేట/ ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణిని శనివారం మున్సిపల్ కమిషనర్ ఇ. జోనా చైర్మన్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై వారు చర్చించారు. ముఖ్యంగా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సేవల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేస్తూ నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఈ సందర్భంగా చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బెజ్జం పాపరావు, తిరుపెల్లి వాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కోర్టు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**- నాణ్యతలో రాజీ పడొద్దు.. పరిశీలించిన జిల్లా జడ్జి నిర్మలగీతాంబ**







**వర్ధన్నపేట/ ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కోర్టు భవన నిర్మాణ పనులను శనివారం వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి. నిర్మలగీతాంబ ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణితో కలిసి ఆమె నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న జడ్జి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కోర్టు భవనాన్ని ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువచ్చేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ ఇసంపెల్లి జోనా ,ఆర్అండ్‌బీ డీఈ, ఏఈలు, వార్డు కౌన్సిలర్లు బెజ్జం పాపరావు, తిరుపెల్లి వాణి, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే మెడికల్ కాలేజీ..

# సేవలన్నీ నీరసం

**- ముచ్చట్లతో కాలయాపన చేస్తున్న వైద్యాధికారులు -ఆసుపత్రికి వెళ్తే పట్టించుకునే నాధుడే కరువు**

**- ప్రమాదానికి గురైన అటవీశాఖ ఉద్యోగికి దక్కని ప్రాథమిక చికిత్స**





**నర్సంపేట/ఏప్రిల్ 25(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నర్సంపేటలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. అక్కడ పనిచేసే వైద్యాధికారుల తీరు పేరు గొప్ప. ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. ఆపదలో ఉన్న రోగిని ఆదుకోవాల్సిన వైద్యులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ముచ్చట్లతో కాలయాపన చేస్తుండటంతో సామాన్య ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రమాదం జరిగినా కదలని వైనం!

శుక్రవారం మధ్యాహ్నం అటవీశాఖలో విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు అనే ఉద్యోగి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. బైక్ పై నుండి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి ఉద్యోగి యోగి, హుటాహుటిన బాధితుడిని నర్సంపేట మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లినా, అక్కడ ఉన్న వైద్యాధికారులు మాత్రం తమ సొంత ముచ్చట్లలో మునిగిపోయారు. కనీసం రోగికి ఏమైంది? ఎక్కడ దెబ్బలు తగిలాయి? అని అడిగే నాధుడే కరువయ్యారు.

## అడిగితే అహంకారం..

రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కనీసం రక్తపోటు (బీపీ) అయినా చూడండి అని తోటి ఉద్యోగి యోగి వైద్యులను బతిమాలారు. అయినా వారిలో చలనం రాలేదు. సరికదా. ప్రశ్నించినందుకు తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా అహంకారపూరితంగా వ్యవహరించారని బాధితుడి స్నేహితులు వాపోతున్నారు. ప్రాథమిక చికిత్స కూడా అందించే మనసు లేని వైద్యుల తీరును చూసి విస్తుపోయిన వారు, ప్రాణాపాయం పొంచి ఉండటంతో వెంటనే అక్కడి నుండి బాధితుడిని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సకాలంలో చికిత్స అందడంతో నాగరాజు కోలుకుంటున్నారు.

## నిర్లక్ష్యంపై నిరసన..

మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో కనీస బీపీ చెక్ చేసే పరికరాలు ఉన్నా, వాడే మనుషులు లేకపోవడం దారుణమని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఎమర్జెన్సీ కేసులను కూడా గాలికి వదిలేసి, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఆసుపత్రి అని నమ్మి వస్తే, చివరకు ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సూపర్ డ్యూటీ.. సున్నా వైద్యం!

ప్రభుత్వం లక్షల రూపాయల జీతాలు ఇస్తున్నా, కొందరు వైద్యులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. ఆసుపత్రిలో రోగుల రద్దీని పట్టించుకోకుండా గంటల తరబడి గ్రూపులుగా చేరి సొంత వ్యవహారాలు మాట్లాడుకోవడం ఇక్కడ నిత్యకృత్యంగా మారిందని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నర్సంపేట మెడికల్ కాలేజీలో వైద్య సేవలపై నిఘా పెంచాలని బాధితులు కోరుతున్నారు